క్లుప్తంగా

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



వారాడలో గ్రామసభను నిర్వహిస్తున్న సర్పంచ్ సౌజన్య

కె.కోటపాడు: ఉపాధి పనులు పూర్తి పారదర్శకంగా చేయడంతో వేతనదారులకు ఉపాధితోపాటు గ్రామాభివృద్ధి చెందుతుందని సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య తెలిపారు. వారాడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం 2022–23 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ కాలంలో ఆరు ఉపాధి పనుల ద్వారా 362 మందికి పనులను కల్పించి రూ.42 లక్షల ఉపాధి నిధులు వేతన రూపంలో అందించినట్లు ఎస్ఆర్పీ రామారావు తెలిపారు. వీటితోపాటు మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో రూ.9.90 లక్షల ఉపాధి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఉప సర్పంచ్ చిరికి గోవింద్, ఈసీ రామునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్, వీఆర్పీ చిన్నమ్ములు పాల్గొన్నారు.

112 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరుతో గ్రామాల్లో ప్రజల చెంతకే వచ్చి వైద్యం అందిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. శనివారం రొంగలినాయుడుపాలెంలో ఫ్యామిలీ డాక్టరు సేవలందించారు. 112 మందికి ఓ.పి ద్వారా వైద్యం చేయడంతోపాటు అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి ముగ్గురిని పరీక్షించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండలో వర్షం



చోద్యంలో కురుస్తున్న వర్షం

గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట, లింగంపేట, పాడి, రత్నంపేట, చోద్యం తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గంట పాటు కురిసిన వర్షం మెట్ట ప్రాంతాల్లో టమాటా, చెరకు, వంగ, బీర పంటలకు ఎంతో మేలు చేసింది. ఖరీఫ్ నాట్లు వేసిన మెరక భూములకు ఈ వర్షం ప్రాణం పోసిందని రైతులు చెబుతున్నారు. చాలా కాలంగా పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఈ వర్షం కురిసి మేలు చేసిందని ఆనందం వ్యక్తం చేశారు.

35 పశువులకు వైద్య సేవలు



పశువులకు వైద్య సేవలందిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: ఎం.గదబూరులో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మాడుగుల పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం 35 పశువులకు వైద్య సేవలందించారు. లేబొరేటరీ సిబ్బంది సహకారంతో రక్త, పేడ పరీక్షలు నిర్వహించారు. దూడ పెయ్యల్లో మరణాల నివారణ గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. 75 శాతం సబ్సిడీపై కాకిజొన్న, అలసంద, గడ్డి విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అజోల్లా పెంపకం వల్ల కలిగే లాభాలు వివరించారు. డాక్టర్ శైలేంద్ర, లైవ్ స్టాక్ సహాయకురాలు సౌజన్య, అంబులెన్స్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ

నర్సీపట్నం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో రెండు చోట్ల నుంచి సీపీఐ పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వామపక్ష లౌకిక ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని పోటీ చేస్తామన్నారు. జిల్లాలోని నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల నుంచి పార్టీ అభ్యర్థులను నిలుపుతున్నామన్నారు. సీపీఐ అనుబంధ సంఘాలు కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. పార్టీ నాయకులు రామునాయుడు, గురుబాబు, రాధాకృష్ణ, రాజు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

- పురవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



రథంపై ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు



సాంస్కృతిక ప్రదర్శన



ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, భక్తులు

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో గురువారం రాత్రి గౌరీ పౌర్ణమి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రోలుగుంటలో గ్రామ ఇలవేల్పు గౌరీ పరమేశ్వరులను పూజించారు. ఇక్కడ ఉత్సవ నిర్వహకుడు పోతల లక్ష్మీశ్రీనివాస్ సంప్రదాయ బద్ధంగా దేవాంగుల వీధిలో వీరభద్రస్వామి ని కుల పెద్దలతో కలసి దర్శించుకున్నారు. జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, మునసబ్ కుటుంబీకులు, భక్తులతో కలసి గౌరీపరమేశ్వరులను దర్శించుకుని వస్త్రాలు సమర్పించారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లో స్థిరపడిన వారంతా వచ్చి గ్రామ దేవతను దర్శించుకున్నారు. అనంతరం ఇక్కడ ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను భక్తులు రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఆ సమయంలో వివిధ సంప్రదాయ నృత్యాలతోపాటు నేల డ్యాన్సులు, కేరళ వాయిద్యాలు ప్రదర్శించారు. నూకాలమ్మ, కనక దుర్గమ్మ, మరిడమ్మ తదితర నృత్య ప్రదర్శనలు, మిరిమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఎటువంటి గొడవలు జరగకుండా కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలు కొమరవోలులో మాజీ సర్పంచ్ గొర్లె చెల్లంయుడు ఆధ్వర్యంలోను, కొవ్వూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యర్రంశెట్టి రాజారావు ఆధ్వర్యంలో స్థానికులు నిర్వహించుకున్నారు.

రూ.34 కోట్లతో ఉపాధి హామీ పనులు

నరుగుడు గ్రామసభలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది రూ.34.85 కోట్లతో అంచనా బడ్జెట్ తయారు చేస్తామని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. సర్పంచ్ గంగరాజు అధ్యక్షతన శుక్రవారం సరుగుడు పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జాబుకార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఏడు లక్షల మందికి ఉపాధి పని దినాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. దీనికి గాను రూ.20 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. మెటీరియల్ రూపంలో రూ.13 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. సరుగుడు పంచాయతీలో ఈ ఏడాది రూ.1.35 కోట్లతో ఉపాధి పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు గిరిజన గ్రామాల్లో అధికంగా ఖర్చు చేసేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. అనంతరం పంచాయతీలో ప్రజలకు ఉపయోగపడే పనులను సర్పంచ్ వివరించారు. ఏపీవో చిన్నారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరు బండి గంగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహార కిట్ల పంపిణీ

జిల్లా జెడ్పీ స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేయిస్తున్న చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ

దేవరాపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి నెలా సక్రమంగా పంపిణీ చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ ఆదేశించారు. బోయిలకింతాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త రోజారమణి సక్రమంగా పౌష్టికాహారం అందించడం లేదని స్థానికులు గత నెలలో స్పందనలో కలెక్టర్‌తోపాటు అనురాధకు ఫిర్యాదు చేయగా, అప్పట్లోనే ఆమె తక్షణమే స్పందించి దగ్గరుండి పౌష్టికాహార కిట్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా సక్రమంగా అందుతున్నాయా లేదా అని శుక్రవారం పరిశీలించారు. సుమారు గంటకుపైగా అంగన్‌వాడీ కేంద్రంలో గడిపి చిన్నారులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించిన పౌష్టికాహారం తిన్న చిన్నారులకు ఆమె స్వయంగా నిద్రపుచ్చారు. పౌష్టికాహారం అందేలా అనురాధ చూపిన చొరవ పట్ల గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ విడుదల



పార్టీ నాయకులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు

నర్సీపట్నం: విజయవాడలో ఈ నెల 15న ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రుత్తల శంకరరావు కోరారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ప్రజా రక్షణ భేరి సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం పోర్టు, రాజధాని నిర్మాణం, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ ఏర్పాటును విస్మరించిందన్నారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తెగనమ్మడానికి సిద్ధమైందన్నారు. వీటిన్నింటిపై కేంద్రం మెడలు వచ్చేందుకు ప్రజా రక్షణ భేరి నిర్వహిస్తున్నామన్నారు. ఐద్వా నాయకులు ఎల్.గౌరి, పార్టీ నాయకులు రాజు పాల్గొన్నారు.

ఆకుముడత తెగుళ్లు సోకకుండా చర్యలు



కింతలి వల్లాపురంలో అవగాహన కల్పిస్తున్న ఏవో వాసుదేవరావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజ్‌కుమార్, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: వరి పంటలో తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొండెంపూడి కె.వి.కె శాస్త్రవేత్త డాక్టరు రాజ్‌కుమార్ తెలిపారు. ఏవో వై. కాంతమ్మ ఆధ్వర్యంలో స్థానిక సంతతోటలో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. ముందుగా వరి దుబ్బులను, ఆకులను పరిశీలించి తెగుళ్లు సోకినట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు కె. సత్యారావు, భాగ్య పాల్గొన్నారు.

మాడుగుల: పొట్ట దశలో వరి పంటకు ఆకుముడత తెగులు ఆశించిందని ఏవో వాసుదేవరావు తెలిపారు. కింతలి వల్లాపురంలో వైఎస్సార్ పొలం బడి నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆకుముడత తెగులు నివారణకు ఎకరాకు 80 మిల్లీమీటర్ల క్లోరాంత్రినిలిపోల్ అనే మందు 200 మిల్లీలీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, వై.కల్యాణకుమార్ పాల్గొన్నారు.

9న బీఎస్పీ బహిరంగ సభ

నర్సీపట్నం: పట్టణంలో ఈ నెల 9న బీఎస్పీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి బొట్టా నాగరాజు కోరారు. సభకు సంబంధించిన కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్, పాడేరు మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు గంగాధర్, నల్లి కళ్యాణం, అప్పారావు, ఆనంద, సూరిబాబు, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా ఈశ్వరరావు



చోడవరం రూరల్: చోడవరం కోర్టుల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా సీనియర్ న్యాయవాది ములగపాక ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరినట్టు చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డేవిడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాడుగుల మండలం గాదిరాయి గ్రామానికి చెందిన ఈశ్వరరావు 1994లో న్యాయవాది గుమస్తాగా విధుల్లో చేరారు. తన వృత్తిని కొనసాగిస్తూ బి.ఏ డిగ్రీ అనంతరం ఎల్.ఎల్.బిని పూర్తి చేశారు. 2006లో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు అయినప్పటి నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. గత నెల 26 నుంచి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా ప్రభుత్వం నియమించడంతో ఆనాటి నుంచి తన విధులు నిర్వర్తిస్తున్నారు. ఏజీపీగా నియమితులైన ఆయనను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, కార్యదర్శి జి.కృష్ణవేణి సహచర న్యాయవాదులు అభినందించారు.

దేవాలయాల నిర్మాణానికి మార్కింగ్



శ్రీవారంపురంలో ఆలయ నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న దృశ్యం

గొలుగొండ: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మంజూరైన ఆలయాల నిర్మాణాలకు శుక్రవారం పలు గ్రామాల్లో మార్కింగ్ పనులు నిర్వహించారు. దేవదాయ శాఖ డీఈఈ ఎస్‌కే సైదా, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించారు. గొలుగొండ, పాతమల్లంపేట, శ్రీరాంపురం, ఉగ్గంపేట భీమునిపట్నం, గాదంపాలెం తదితర గ్రామల్లో ఆలయాలు నిర్మించనున్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గొలుగొండ మండలానికి రెండో దఫా 40 దేవాలయాల మంజూరుకు కృషి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆలయాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని డీఈఈ తెలిపారు. కార్యక్రమంలో గొలుగొండ సర్పంచ్ కసిపల్లి బుజ్జి, మాజీ ఎంపీటీసీ గండెం ఈశ్వర్రావు, ఉప సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థి



విద్యార్థి సాయికుమార్

దేవరాపల్లి: తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ విద్యార్థి పి. సాయికుమార్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.వి.ఎల్.ఎన్. నర్సింహరావు శుక్రవారం తెలిపారు. గత నెల లంకెలపాలెంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అతడు విశేష ప్రతిభ కనబరిచి అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలో జరిగే ఈ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. సదరు విద్యార్థితోపాటు పీఈటీలు జి. తరుణేశ్వరరావు, ఎస్. నాగేశ్వరరావులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను అభినందించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్

మాకవరపాలెం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు వలంటీర్ పింఛను నగదు అందించింది. తూటిపాల గ్రామానికి చెందిన కామిరెడ్డి రాజులమ్మ గాజువాకలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో వలంటీరు ఎస్.ఉమా శుక్రవారం సర్పంచ్ గవిరెడ్డి ప్రసాదరావుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి రాజులమ్మకు పింఛను నగదును అందించింది.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు



బీఎల్వోలతో సమావేశమైన తహసీల్దార్ వరహాలు

రోలుగుంట: మండలంలో 43 పోలింగు కేంద్రాల పరిధిలో శని, ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దారు కె. వరహాలు తెలిపారు. ఈ కార్యక్రమంపై శుక్రవారం తన కార్యాలయంలో బీఎల్వోలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అర్హత గల ఓటర్ల వివరాల సేకరణ, జాబితాలు తయారు, సంబంధించిన ఫారం ఎలా నింపాలి, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. విధుల నిర్వహణకు సంబంధించి బీఎల్వోల సందేహాలను నివృత్తి చేశారు.

బాల్య వివాహాల రహిత సమాజానికి కృషి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉషారాణి, సంధ్యారాణి

దేవరాపల్లి: బాల్య వివాహాల రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సీడ్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ ఉషారాణి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం. సంధ్యారాణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు 'బాల్య వివాహాల నిర్మూలన–బాలలకు అందుబాటులో న్యాయం' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్ పాల్పడి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

ఓటర్ల జాబితా నిశిత పరిశీలన తప్పనిసరి

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై నియోజకవర్గంలోని బూత్ కన్వీనర్లు నిశిత పరిశీలన చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముసాయిదాను ప్రతి కన్వీనర్ నిశితంగా పరిశీలించి జాబితాలోని ఏమైనా పొరపాట్లు ఉంటే, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సరి చేయించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో నూతన ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియ జరుగుతున్నందున దగ్గర ఉండి ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా చేర్పించాలన్నారు. బూత్ స్థాయిలో పార్టీ పటిష్టతకు బూత్ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనువాసరావు, కౌన్సిర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, పార్టీ నాయకుడు కర్రి రాంగోపాల్, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యసన సామర్థ్య పరీక్షలు



కింతాడ కేజీబీవీలో పరీక్షలను పరిశీలిస్తున్న అధ్యాపకురాలు మహలక్ష్మి



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



విద్యా సాఫల్య గణన నిర్వహణను పరిశీలిస్తున్న అధికారులు

కె.కోటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 3, 6, 9 తరగతుల విద్యార్థులకు అభ్యసనా సామర్థ్య పరీక్షలు నిర్వహించినట్టు భీమిలీ డైట్ కళాశాల అధ్యాపకురాలు ఎం.మహలక్ష్మి తెలిపారు. మండలంలోని 21 పాఠశాలల్లో శుక్రవారం తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై పరీక్షలను నిర్వహించారు. కింతాడ కేజీబీవీలో ఈ పరీక్షలను ఆమె పరిశీలించారు. స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే – 2023 పరిశీలన నిమిత్తం పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో అభ్యసనా సామర్థ్య పరీక్షలను ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, సత్యనారాయణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్ములు పరిశీలించారు.

రావికమతం: కొత్తకోట జెడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు సామర్థ్య సర్వే పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే –2023 పరీక్ష మూడు, ఆరో తరగతి విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ ద్వారా నిర్వహించారు. దీనికి మండల కేంద్రం నుంచి ఇన్విజిలేటర్లను నియమించారు. ఈ పరీక్ష రాయడం ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, అంతరాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టేందుకు కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేస్తుందని హెచ్ఎం కె.నాగేశ్వరరావు తెలిపారు.

మాకవరపాలెం: విద్యా సాధన సర్వేలో భాగంగా విద్యార్థులకు సామర్థ్య పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో చదువుతున్న మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితంలో సామర్థ్యాలను తెలుసుకునేందుకు శుక్రవారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలు 21 పాఠశాలల్లో నిర్వహించగా, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా బీఈడీ, ఇంజినీరింగ్ విద్యార్థులను నియమించారు. పరీక్ష కేంద్రాలను ఎంఈవోలు లక్ష్మి, మూర్తి పర్యవేక్షించారు.

చోడవరం రూరల్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 3, 6, 9 తరగతుల విద్యార్థులతో విద్యాశాఖ అధికారులు మాట్లాడారు. ఇందులో భాగంగా విద్యా వ్యవస్థ బలాలు, బలహీనతలు అంచనా వేయడం, లోపాలను గుర్తించడంతోపాటు ఉపాధ్యాయుల వృత్తి పరమైన ఎదుగుదలకు తోడ్పాటు అందించడం, అభ్యాసనా లక్ష్యాలను చేరుకోవడంలో ఎటువంటి ఫలితాలు సాధించామన్న అంశాల్ని పరిగణనలోకి తీసుకోవడానికి ఈ పరిశీలన చేసినట్టు ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలం తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యా సాఫల్య గణన అమలు తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, సీఆర్పీ కె.వి.ఎం .నాయుడు పాల్గొన్నారు.

బి. సింగవరంలో అదుపులోకి వచ్చిన డయేరియా



మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో డయేరియా రోగులను పరామర్శిస్తున్న ఎంపీపీ రామధర్మజ

మాడుగుల రూరల్: చీడికాడ మండలం బి. సింగవరంలో డయేరియా అదుపులోకి వచ్చింది. ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేసి రెండు రోజులుగా జైతవరం ఏఎన్ఎంతోపాటు ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఇతర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. అవసరమైన వారికి సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తున్నారు. దీంతోపాటు మందులు అందిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ ముందస్తుగా పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. మంచినీటి సరఫరా పరిశీలించారు. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ పరామర్శించారు. వారికి పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఊరంతా బ్లీచింగ్, క్లోరినేషన్ చేయిస్తామని కార్యదర్శి తెలిపారు.

రోలుగుంటను కరవు మండలంగా ప్రకటించాలి



కొవ్వూరులో వరి పొలాలను పరిశీలిస్తున్న సర్పంచ్ కాంతమ్మ

రోలుగుంట: వర్షాభావ పరిస్థితుల కారణంగా తెగుళ్లు ఆశించి దెబ్బతిన్న పంటలను సంబంధిత అధికారులు పరిశీలించి కరవు మండలంగా రోలుగుంటను ప్రకటించాలని సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ కోరారు. శుక్రవారం ఆమె కొవ్వూరులో తెగుళ్లు ఆశించి దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరినాట్లు తర్వాత సమృద్ధిగా వర్షాలు కురవక ఈ పరిస్థితి నెలకొందన్నారు. నీటి ఇంజిన్ తడులతో కాపాడుకున్నా, పెట్టుబడులకు తగ్గట్టుగా దిగుబడులు వచ్చే అవకాశం లేదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని గ్రామాలు సందర్శించి దెబ్బతిన్న పంటలు, రైతుల పెట్టుబడులు, నష్టాలు తెలుసుకుని కరవు మండలంగా ప్రకటించాలని కోరారు.